సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



కరెంట్ కోతలపై కన్నెర్ర

విద్యుత్ కోతలను నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రైతులు ఆందోళనలకు దిగారు.

వివరాలు 8లో ▸



తాగి నడిపితే జైలుకే

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.2 /18.2

వాతావరణం

రాత్రివేళలో చలి తీవ్రత తగ్గుతుంది. క్రమంగా ఎండప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెడుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'ప్రజాగోస బీజేపీ భరోసా' ప్రారంభం

గద్వాల రూరల్: బిజేపీ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా గోస బిజేపీ భరోసా కార్యక్రమాన్ని ఈనెల 10 వ తేది శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో కాకులారంలో సాయంత్రం 4గంటలకు బిజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకేఅరుణ, అలంపూర్ నియోజకవర్గం అయిజ మున్సిపాలిటీలో ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

రాజోళి: అన్ని గ్రామాల విద్యార్థులకు కళాశాల విద్య అందాలంటే రాజోళిలో ఇంటర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాల్సిందేనని పెద్దదన్వాడ గ్రామస్తులు, విద్యార్థులు అన్నారు. గురువారం మండలంలోని పెద్ద దన్వాడలో కాలేజీ సాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది వేలాది మంది విద్యార్థులు పాఠశాల విద్య పూర్తి చేసుకున్నప్పటికీ, ఆపై చదువులకు వెళ్లే వారి సంఖ్య మాత్రం పూర్తిగా తగ్గిపోతుందని, దానికి కారణం అందుబాటులో కళాశాల లేకపోవడమేనని అన్నారు. ఇతర మండలాల్లో కళాశాల ఉండడం, బాలికలు వెళ్లేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో తల్లిదండ్రులు చదువు మాన్పించి వివాహాలు చేయడం, పనిలో ఉంచడం చేస్తున్నారని అన్నారు. పాఠశాలలు అందుబాటులో ఉన్నట్లుగానే కళాశాలలు కూడా ఉంటే విద్యార్థులకు ఉన్నత విద్య అందుతుందని అన్నారు. ఈమేరకు కళావాల ఏర్పాటు చేయాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో కళాశాల సాధన సమితి కన్వీనర్ ఈశ్వరయ్య, చంద్ర గౌడ్, సర్పంచ్ మార్తమ్మ, ఉప సర్పంచ్ చిన్నయ్య, అలెగ్జాండర్,ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

12, 13న ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ (సీఎం కప్)లో పాల్గొనే ఉమ్మడి జిల్లా పురుష, మహిళా జట్ల ఎంపికలను ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి మహ్మద్ హనీఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల వాలీబాల్ జట్టు ఎంపికలను ఆదివారం జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఉదయం 8.30 గంటలకు, మహిళా జట్టు ఎంపికలను సోమవారం ఉదయం 8.30 గంటలకు బాలానగర్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో చేపడుతామన్నారు. పూర్తి వివరాల కోసం పురుష క్రీడాకారులు పర్వేజ్‌పాష కోచ్ సెల్ నం .77805 82604, మహిళలు అరుణ పీఈటీ సెల్ నం.77807 38829లను సంప్రదించాలని ఆయన సూచించారు.

గ్రూప్స్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గ్రూప్స్– 2,3,4 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా అధికారి పాండు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తులు స్వీకరించినా.. ఆశించిన స్థాయిలో రాకపోవడంతో మరోసారి ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 13లోగా కలెక్టరేట్‌లోని ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. మరింత సమాచారం కోసం 91103 30980 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నేటినుంచి దేవరకద్రలో ఆగనున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు

దేవరకద్ర: స్థానిక రైల్వే స్టేషన్‌లో శుక్రవారం నుంచి తుంగభద్ర, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపనున్నట్లు రైల్వే డీఓఎం వెంకన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు దేవరకద్ర రైల్వేస్టేషన్‌కు గురువారం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సంబంధించిన వివరాలు అందాయి. ఉదయం 7.20 గంటలకు కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు (సికింద్రాబాద్) వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నం.17024 దేవరకద్ర స్టేషన్‌లో ఆపుతారు. అలాగే సాయంత్రం 4.30 గంటలకు కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ నం.17028 ఆపుతారు. ఈ రెండు ఎక్స్‌ప్రెస్‌లు హైదరాబాద్ వైపు వెళ్లేవే. అయితే ఎంత మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తారనే విషయం తెలుసుకోడానికి అధికారులు ఈ ట్రయల్ నిర్వహిస్తున్నారు. నిత్యం నిర్ధారిత కెపాసిటీ ప్రకారం ప్యాసింజర్లు రాకపోకలు సాగిస్తే మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను దేవరకద్రలో నిలిపే అవకాశం ఉంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపడానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేసిన కృషి ఫలితమే అని స్థానిక బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

● పాలమూరుపై సీబీ'ఐ'

బియ్యం దొంగల్లో భయం!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:


పాలమూరు వ్యాప్తంగా సాగుతున్న సీఎమ్మార్ దందాపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ కన్నేసింది. దేశ వ్యాప్తంగా పలురాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, కస్టం మిల్లింగ్ రైస్ అప్పగింతలో చోటుచేసుకున్న అక్రమాలపై భారత ఆహార సంస్థ అధికారుల సహకారంతో ఇది వరకే విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణలో ప్రధానంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై నజర్ వేసినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతల అండ, జిల్లా అధికారుల సహకారంతో పలువురు రైస్ మిల్లర్లే మాఫియాగా ఏర్పడి ఒక్కపైసా పెట్టుబడి పెట్టకుండా నిరాటంకంగా దందా కొనసాగిస్తున్నట్లు గ్రహించిన సీబీఐ అధికారులు పక్కాగా ఆధారాలు సేకరిస్తున్నారు. పది రోజులుగా పలు రైస్ మిల్లులపై ప్రత్యేక నిఘా పెట్టి రహస్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఓ పది మిల్లులకు సంబంధించిన సీఎమ్మార్ అక్రమాల చిట్టా ఆధారాలతో సహా సీబీఐ చేతికి లభించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

గడువులపై గడువు పెంచినా..

ప్రతి ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని సీఎమ్మార్ బియ్యంగా మార్చేందుకు రైస్ మిల్లుల సామర్థ్యాన్ని బట్టి ఆయా మిల్లర్లకు కేటాయిస్తోంది. ఈ ధాన్యాన్ని క్వింటాల్‌కు రారైస్ అయితే 67 కిలోలు, బాయిల్డ్ అయితే 68 కిలోలను సీఎమ్మార్ బియ్యంగా తిరిగి ప్రభుత్వానికి పెట్టాల్సి ఉంటుంది. ఇక్కడే మిల్లర్లు గోల్‌మాల్‌కు తెరలేపారు. నాణ్యమైన ధాన్యాన్ని ఆయా మిల్లర్లు నేరుగా బ్లాక్‌మార్కెట్‌కు తరలించి.. పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి పెడుతూ బురిడీ కొట్టిస్తున్నారు. 2021–22 వానాకాలం సీజన్‌కు సంబంధించి 98,965 మెట్రిక్ టన్నులు, యాసంగి సీజన్‌కు సంబంధించి 2,56,736 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇంకా ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. బియ్యం కేటాయించి ఇప్పటికే రెండేళ్లు అవుతున్నా... మిల్లర్లు జాప్యం చేయడంతో తొలుత గతేడాది డిసెంబర్ వరకు.. ఇటీవల ఈ నెల చివరివరకు మరోసారి గడువు పెంచారు. గడువు మీద గడుపు పెంచడంతో ఈ మేరకు సంవత్సరాల వారీగా చిట్టా తీసిన సీబీఐ అధికారులు సదరు మిల్లులపై గుట్టుచప్పుడు కాకుండా ఆరా తీసినట్లు సమాచారం.

సీఎమ్మార్‌లో అక్రమాలపై రహస్య విచారణ

- ప్రధానంగా మిల్లర్లపైనే నజర్
- డీఫాల్ట్ మిల్లులకూ కస్టం మిల్లింగ్ ధాన్యం కేటాయింపులు
- గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గుర్తింపు?
- కేంద్ర అధికారుల చేతిలో అక్రమార్కుల చిట్టా
- అధికారులు, నేతల పాత్రపై కూడా ఆరా?



ఉమ్మడి జిల్లాలో 2021-22 ఖరీఫ్ సీఎమ్మార్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	కేటాయించిన మిల్లులు	కేటాయించిన సీఎమ్మార్ ధాన్యం	మిల్లర్లు తిరిగి ఇవ్వాల్సినబియ్యం	మిల్లర్లు తిరిగి ఇచ్చినవి	పెండింగ్
మహబూబ్‌నగర్	89	1,58,678	1,06,314	97,244	9,070
వనపర్తి	112	2,44,569	1,63,861	1,04,392	59,469
నారాయణపేట	46	1,20,941	81,030	71,682	9,348
గద్వాల	47	52,428	35,127	34,764	363
నాగర్‌కర్నూల్	87	1,22,304	81,943	61,228	20,715
మొత్తం	381	6,98,920	4,68,275	3,69,310	98,965
యాసంగిలో...					
మహబూబ్‌నగర్	56	91,145	61,978	28,360	33,618
వనపర్తి	97	1,36,835	93,048	28,923	64,125
నారాయణపేట	40	95,812	64,194	22,214	41,980
గద్వాల	41	86,379	58,738	13,452	45,286
నాగర్‌కర్నూల్	87	1,25,554	84,816	13,089	71,727
మొత్తం	321	5,35,725	3,62,774	1,06,038	2,56,736

ప్రభుత్వ సొమ్మును పెద్ద ఎత్తున కాజేస్తూ జేబులు నింపుకుంటున్న జిల్లాలోని రైస్ మిల్లుల చిట్టా సీబీఐ చేతికి చిక్కినట్లు తెలుస్తోంది. 2019–20 యాసంగి సీజన్‌కు సంబంధించి గద్వాల జిల్లాలో సాయిబాలాజీ ఆగ్రోటెక్, వెంకటేశ్వర రైస్ మిల్లులు సకాలంలో సీఎమ్మార్ బియ్యం పెట్టలేదు. ఈ మేరకు అధికారులు ఆ రెండు మిల్లులకు 125శాతం జరిమానా విధించారు. ఆ తర్వాత 2020–21 యాసంగిలో యథావిధిగా సీఎమ్మార్ ధాన్యం కేటాయించారు. అయినా ఆ మిల్లర్లు ప్రభుత్వానికి సకాలంలో బియ్యం అందజేయలేదు.

సీబీఐ చేతిలో చిట్టా..

వీటితో పాటు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సాయి పారా బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్ కూడా అందజేయకపోవడంతో 125శాతం జరిమానా విధించారు. సదరు మిల్లుల యజమానులకు నోటీసులు సైతం జారీచేశారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పరిధిలోని శ్రీ లక్ష్మివెంకటనరసింహ పారా బాయిల్డ్ ఇండస్ట్రీస్, వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలోని పద్మావతి పారాబాయిల్డ్ ఇండస్ట్రీస్ సకాలంలో సీఎమ్మార్ చెల్లించనందుకు 125శాతం జరిమానా విధించారు. అయినా ఆ మిల్లుకు మళ్లీ సీఎమ్మార్ ధాన్యం కేటాయించారు. డిఫాల్టర్లు అని అధికారులే తేల్చిచెబుతున్నప్పుడు మళ్లీ ఆయా మిల్లర్లకు ధాన్యం కేటాయించడ వెనుక ఉన్న మతలబు ఏమిటనే దానిపై సీబీఐ అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మిల్లుల చిట్టా సీబీఐ చేతికి ఆధారాలతో సహా చిక్కగా గద్వాల జిల్లాలో ఇటిక్యాల, అలంపూర్, అయిజ మండలాల పరిధిలోని మరో ఏడు మిల్లులు, వనపర్తి జిల్లాలో దేవుడి పేరిట ఉన్న మిల్లులో ఇలాంటి అక్రమాలే చోటుచేసుకున్నాయన్న దానిపై రహస్య విచారణ చేస్తుండడం అక్రమార్కులతో పాటు అధికారుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. అయితే సీబీఐ విచారణపై తమకు సమాచారం లేదని, 2021–22 ఖరీఫ్‌కు సంబంధించిన సీఎమ్మార్ ధాన్యం అప్పగించేందుకు ప్రభుత్వం గడువు ఈ నెల చివరి వరకు పెంచిందని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు.

2019కి ముందు దివాలా.. నేడు కళకళ..

2019 సంవత్సరానికి ముందు గద్వాల జిల్లాలో దాదాపు 50 రైస్‌మిల్లులున్నాయి. ఇందులో 10 నుంచి 15 మిల్లులు మాత్రమే వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తుండగా.. మిగిలినవి దాదాపుగా దివాలా తీశాయి. ఎప్పుడైతే ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించడం మొదలు పెట్టిందో.. ఒకటి, రెండేళ్లల్లోనే దివాలా తీసిన మిల్లులు కళకళలాడుతున్నాయి. ఎలాంటి డిపాజిట్ లేకుండానే రూ.కోట్లు విలువ చేసే ధాన్యాన్ని మిల్లులకు కేటాయిస్తుండగా.. పెట్టుబడి లేకుండా అక్రమార్కులు సీఎమ్మార్ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తూ దండుకుంటున్నారు. కాగా.. 2019కి ముందు, ప్రస్తుతం సదరు మిల్లులు, ఆయా మిల్లర్ల ఆస్తులపై సీబీఐ అధికారులు కూపీలాగుతున్నట్లు తెలిసింది.

క్రైమ్ రేటును తగ్గించాలి



మానవపాడు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సృజన

ఎర్రవల్లిచౌరస్తా/మానవపాడు: పోలీస్‌స్టేషన్లలో క్రైమ్ రేటును తగ్గించాలని ఎస్పీ సృజన సిబ్బందికి సూచించారు. గురువారం ఇటిక్యాల మండలంలోని కోదండాపురం పీఎస్, సిఐ కార్యాలయాన్ని, మానవపాడు పీఎస్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని వచ్చే వారికి ఖచ్చితంగా న్యాయం చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న సివిల్ కేసులలో పోలీస్ వారు జోక్యం చేసుకోరాదని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లు అంటే ప్రజలకు రక్షణ నిలయాలుగా ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, అక్రమాలకు పాల్పడే వారికి శిక్ష పడేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ సూర్యనాయక్, ఎస్ఐ వెంకటస్వామి, సీసీ లోహిత్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించాలి

ప్రజలకు పోలీసులు ఉత్తమ సేవలు అందించాలని ఎస్పీ సృజన పేర్కొన్నారు. మానవపాడు పోలీస్‌స్టేషన్‌లో 5ఎస్ ఇంప్లిమెంటేషన్ పనితీరును పరిశీలించారు. ఏ తరహా కేసులు అధికంగా నమోదు అవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి–44పై ప్రమాదాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్లాకోట్స్, పెట్రోకార్సు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. డయల్ 100కు కాల్స్ వచ్చిన వెంటనే స్పందించాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో శాంతినగర్ సిఐ శివశంకర్‌గౌడ్, ఎస్ఐ సంతోష్, సీసీలు లోహిత్ పాల్గొన్నారు.

నేడు నాటక ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి 7 గంటలకు జనతా సేవా సమితి ఆధ్వర్యంలో భక్తిరస నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరకవుల నరహరిరాజు రచన, సంగీతం, దర్శకత్వంలో శ్రీభద్రాద్రి రామదాస చరితం భక్తిరస నాటక ప్రదర్శన ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

నాణ్యమైన సీడ్ పంపిణీ చేసేలా చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- పత్తి పంట నష్టం, కారణాలపై నివేదిక ఇవ్వండి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: రాబోయే ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సాగు చేయనున్న పత్తి పంటకు సంబంధించి విత్తన సమస్యలు రాకుండా చూడాలని, భవిష్యత్తులో రైతులకు నాణ్యమైన సీడ్‌ను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో అధికారులు, శాస్త్రవేత్తలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సాగు చేసిన పత్తి పంట నష్టంపై క్షేత్రస్థాయిలో వెళ్లి నష్టానికి గల కారణాలను పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అదేవిధంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేలా భవిష్యత్తులో ఎలాంటి చర్యలు రాకుండా సీడ్ కంపెనీలను బాధ్యులను చేయాలని అన్నారు. సమావేశంలో డీఏఓ గోవిందు నాయక్, శాస్త్రవేత్తలు భరత్ భూషణ్, రామకృష్ణ, వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయిల్ పామ్ పంట లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. జిల్లాకు 4,691 ఎకరాల్లో పంటను సాగు చేసేందుకు లక్ష్యం కాగా 2,367 ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఉద్యానశాఖ అధికారి అక్బర్, ఏడిఏ సక్రియ నాయక్, సంగిత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

'పునరావాసాల్లో' పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఆర్అండ్ఆర్ సెంటర్లలో (పునరావాస కేంద్రాల్లో) పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాలంపాడు, నాగర్‌దొడ్డి, అలూరు, చిన్నోనిపల్లి ఆర్ అండ్ ఆర్ సెంటర్లలో కొనసాగుతున్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ర్యాలంపాడు ఆర్అండ్ఆర్ సెంటర్‌కు సంబంధించి మౌళిక సదుపాయాలను వెంటనే చేపట్టాలన్నారు. అదేవిధంగా నాగర్‌దొడ్డిలో ప్లాట్ల పంపిణీ ప్రక్రియ పూర్తి అయినందున మౌలిక సదుపాయాల పనులపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఎస్సీ శ్రీనివాస రావు, ఆర్డీఓ రాములు, ఈఈ రహీముద్దీన్ తదితరులు ఉన్నారు.

పోలీసు అధికారుల సెల్ నంబర్లు మార్పు

గద్వాల క్రైం: జిల్లా పోలీసుశాఖలోని డీఎస్పీ స్థాయి నుంచి కింది స్థాయి అధికారులకు నూతన ఫోన్ నంబర్లు కేటాయించినట్లు ఎస్పీ సృజన ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల డీఎస్పీ 8712670299, గద్వాల సీఐ 871260298, అలంపూర్ సీఐ 8712670286, శాంతినగర్ సీఐ 8712670291, గద్వాల ఎస్ఐ 8712602798, గద్వాల రూరల్ ఎస్ఐ 871 2670297, ఎస్ఐ మల్దకల్ 8712670295, గట్టు ఎస్ఐ 8712670294, ధరూర్ ఎస్ఐ 8712 670292, కేటీదొడ్డి ఎస్ఐ 8712670293, కొందడపూర్ ఎస్ఐ 8712670283కి కేటాయించారు. అలా గే, అలంపూర్ ఎస్ఐ 8713670285, ఇటిక్యాల ఎస్ఐ 8712670282, ఉండవెల్లి ఎస్ఐ 8712 670284, శాంతినగర్ ఎస్ఐ 8712670288, రాజోళి ఎస్ఐ 8712670287, అయిజ ఎస్ఐ 8712 670289, కంట్రోల్ రూం నంబర్ 8712670306, యాంటీ హ్యూమ్యాన్ ట్రాఫికింగ్ నంబర్ 8712 670308 నేటి నుంచి అందుబాటులోకి వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలు ఫోన్ నంబర్లు మా ర్పును గమనించి పోలీసుశాఖకు సహకరించాల్సిందిగా కోరారు.

రైతుల ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయండి



బ్యాంక్ అధికారులతో సమావేశమైన ఏడీఏ సంగీతలక్ష్మీ

గద్వాల వ్యవసాయం: రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని గద్వాల ఏడీఏ సంగీత లక్ష్మీ బ్యాంక్ మేనేజర్లను కోరారు. గురువారం ఆమె స్థానిక ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంక్‌లో బ్యాంకు అధికారులను కలిశారు. ఈసందర్భం ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ పథకంలో భాగంగా దాదాపు 2500 మంది రైతులు తమ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయించుకోలేదన్నారు. ఈ రైతుల ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ బీఐ బ్రాంచ్ మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి, ఏఓ శ్రీలత, పలువురు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,006

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు గురువారం 537 క్వింటాళ్ళ వేరుశనగ రాగ, క్వింటాలుకు గరిష్టం రూ.8006, కనిష్టం రూ. 4060, సరాసరి రూ. 6520 ధరలు లభించాయి. 16 క్వింటాళ్ళ ఆముదం రాగా గరిష్టం రూ. 6439, కనిష్టం రూ.5916, సరా సరి రూ. 6439 ధరలు పలికాయి. 19 క్వింటా ళ్ళ కంది రాగా, గరిష్టం రూ. 6787, కనిష్టం రూ. 4747, సరాసరి రూ. 4747 ధరలు వచ్చాయి.

ఆముదాల ధర రూ.6,450

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో గురువారం జరిగిన ఈనామ్ టెండర్లలో కాముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,450గా ఒకే ధర నమోదైంది. వానాకాలం సీజన్‌లో పండిన పంటల దిగుబడులు పూర్తి కావడంతో మార్కెట్‌లో లావాదేవీలు తగ్గుముఖం పట్టాయి.

లక్ష్యానికి చేరువ



కంటి పరీక్షలు చేయించుకుంటున్న రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి (ఫైల్)

- కంటి వెలుగులో భాగంగా 4.03లక్షల మందికి పరీక్షలు
- జిల్లాలో 4.50లక్షల మంది లక్ష్యం
- 70,137 మందికి అద్దాలు అందజేత

గద్వాల క్రైం: జిల్లాలో కంటి వెలుగు పరీక్షలు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జనవరి 19వ తేదిన జిల్లాలో ప్రారంభించగా.. గురువారం వరకు 25 బృందాలచే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామా పంచాయతీ, రైతు వేదికల వద్ద కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు 4,03,202 మంది పరీక్షలు నిర్వహించగా 70,137 మంది కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి అద్దాలను అందజేశారు. దృష్టి లోపం ఉన్న 76,097మందికి కంటి అద్దాల కోసం ప్రభుత్వానికి ఆర్డర్ పెట్టారు. వచ్చిన వెంటనే ఆశ వర్కర్ల ద్వారా పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 4.50లక్షల మందికి కంటి పరీక్షలు చేసే విధంగా వైద్యశాఖ చర్యలు తీసుకుంది.

వంద రోజులపాటు..

కంటి వెలుగు పరీక్షలు చేయించుకునేందుకు ప్రజలు శిబిరాల వద్దకు వస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు చేసి కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి అద్దాలు అందజేస్తున్నారు. అయితే ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బులు వెచ్చించి వైద్యులు సిఫార్సు చేసిన అద్దాలు, మందులుకొనాలి. దీంతో ఉచితంగా ప్రభుత్వం కంటి పరీక్షలు చేయడంతో పాటు అవసరమయ్యే అద్దాలను ఇవ్వడం ద్వారా ప్రజలు శిబిరాల వద్దకు వస్తున్నారు. కంటి అద్దాలు అవసరం లేని వారికి మందులు, ఐ డ్రాప్స్ ఇస్తున్నారు. 100 రోజల పాటు జిల్లా వ్యాప్తంగా కంటి పరీక్షలు చేయనున్నారు.



కంటి పరీక్షల కోసం వచ్చిన మహిళలు

18 ఏళ్లపైబడిన వారికి..

కంటి పరీక్షలు నిర్వహించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 25 బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో మెడికల్ ఆఫీసర్, పారా మెడికాల్ ఆప్తాలమిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ముగురు ఆశ వర్కర్లు ఉన్నారు. ఉదయం 9 గంటల నుండి నిర్దేశించిన చోట్లకు వైద్య బృందాలు వెళ్లి 18 సంవత్సరాలు నిండిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నారు. పట్టణాల్లో ప్రతిరోజు 600 – 1000 వరకు, గ్రామీణ ప్రాంతాల్లో 500 మందికి పరీక్షలు చేస్తున్నారు. జిల్లా మొత్తంగా రోజుకు 4వేలకు పైగా పరీక్షలు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు పథకాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కంటి పరీక్షలు చేయించుకొని సమస్యలు ఏమైనా ఉంటే వైద్య పరీక్షల ద్వారా నయం చేసుకోవాలి. లోపాలు గుర్తించి అద్దాలను కూడా ఉచితంగా ఇవ్వనున్నారు.

– శశికళ, జిల్లా ఇంచార్జ్ డీఎంహెచ్ఓ

క్లుప్తంగా

వ్యక్తి ఆకస్మిక మృతి

- బస్సు కండక్టర్, డాక్టర్ సపర్యలు చేసినా దక్కని ప్రాణం

మిడ్జిల్: బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గుండెపోటుతో అకస్మాత్తుగా మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కల్వకుర్తి నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో గురువారం మధ్యాహ్నం మిడ్జిల్ మండలంలోని మున్ననూర్ స్టేజీ దగ్గర గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు ఎక్కారు. ఎక్కిన రెండు నిమిషాలకే పెద్ద వర్ల కృష్ణయ్య(43) ఛాతిలో నొప్పి వచ్చి కిందపడ్డాడు. వెంటనే బస్సులో ఉన్న మహబూబ్‌నగర్ అమ్మ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ విష్ణు, కండక్టర్ సుందర్ కలిసి బస్సును రాణిపేట్ స్టేజీ దగ్గర రోడ్డు పక్కన ఆపి కృష్ణయ్యకు ప్రథమ చికిత్స చేశారు. ఆ తర్వాత 108కు ఫోన్ చేయగా.. అది వచ్చేలోపు కృష్ణయ్య ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆటోలో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. అయితే కొందరు ప్రయాణికులు తమకు ఆలస్యమవుతుందని కండక్టర్‌తో వాగ్వాదానికి దిగడం గమనార్హం.

విద్యుదాఘాతంతో వ్యక్తి ..


పరశురాముడు (ఫైల్)

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చింతలపల్లిలో విద్యుదాఘాతంతో వంగ పరశురాముడు(40) అనే వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం పరశురాముడు ఇంటి సమీపంలో గల వ్యవసాయ పొలం వద్ద బోరు మోటార్ నడవకపోవడంతో ఏమైై ఉంటుందా అని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. అక్కడ కరెంట్ తీగ పడి ఉండగా, గమనించక తీగకు తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామసముద్రంలో మృతదేహం లభ్యం

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని జానంపేట గ్రామ సమీప రామసముద్రం చెరువులో గురువారం మృతదేహం లభించిందని ఇన్‌చార్జి ఎస్‌ఐ జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాల ప్రకారం.. చెరువులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డికి తెలిపారు. ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటికి తీయించి, వనపర్తి ఆస్పత్రికి తరలించారు. అతని మొలతాడుకు కారు కీ ఉండటంతో కారును పోలీసుస్టేషన్‌కు తరలించారు. కారులోని సెల్‌ఫోన్ ఆధారంగా అతని పేరు మణికంట వర్మ (29) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వాసిగా గుర్తించామన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో సాఫ్ట్‌వేర్ జాబ్ వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నాడని, బుధవారం ఉదయం మందులు తీసుకువస్తానని బయటికి వెళ్లాడని, అనంతరం ఫోన్ స్విచ్ఆఫ్ అయ్యిందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

490 కిలోల నకిలీ టీ పొడి పట్టివేత

జడ్చర్ల టౌన్: పట్టణంలోని మమతానగర్‌లో మహమ్మద్ హలీంపాష ఇంట్లో గురువారం 490 కిలోల నకిలీ టీ పొడిని గుర్తించినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. పక్కా సమాచారం రావటంతో తనిఖీ చేసి 14బ్యాగుల్లో ఉన్న టీ పొడిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీని విలువ రూ.62,600 ఉంటుందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కరెంట్ కోతలపై రైతుల కన్నెర్ర

- పంటలు ఎండుతున్నాయని ఆవేదన
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు చోట్ల రాస్తారోకోలు, ధర్నాలు
- వ్యవసాయానికి సరిపడే విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్

జడ్చర్ల టౌన్/శాంతినగర్/తాడూరు: ప్రభుత్వం చెప్పిన విధంగా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని ఉమ్మడి జిల్లాలో పలువురు రైతులు ఆందోళనలకు దిగారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని గంగాపురం రైతులు జడ్చర్ల– కల్వకుర్తి జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఓ వైపు 24 గంటలు త్రీఫేజ్ కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నా.. తమ గ్రామంలో 4 గంటలు కూడా సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడురోజులుగా కరెంట్ సరఫరా పూర్తిగా రావడం లేదని, సమస్యను విద్యుత్ వినియోగదారుల ఫోరం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. మూడురోజులుగా సరఫరా పూర్తిగా రావడం లేదని సమస్య పరిష్కరించేందుకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చున్నారు. రైతుల రాస్తారోకోతో జాతీయ రహదారి ఇరువైపులా పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సరఫరా ఇప్పించేలా కృషి చేయడంతో రైతులు ఆందోళన విరమించారు.


జడ్చర్లలో జాతీయరహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ఐతోల్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన


కోతలు లేని విద్యుత్ సరఫరా చేయాలని మొక్కుతున్న రైతులు

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బలాన్‌పల్లి, ఐతోల్, అంతారం, సిర్సవాడ,పాపగల్ రైతులు మాట్లాడుతూ.. ఒక నిర్దిష్టమైన సమయం లేకపోవడం వల్ల విద్యుత్ ఎపుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని అయోమయం చోటు చేసుకుందన్నారు. పై అధికారులకు విన్నవించినా తమ చేతుల్లో ఏమీ లేదంటూ చేతులు దులుపుకోవడం వల్ల తాము ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నామని, సరైన వేళలు ప్రకటించాలన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ జంతన్ తేజ అక్కడికి చేరుకున్నారు. ఫోన్ ద్వారా ఉన్నతాధికారులతో మాట్లాడించగా.. సరైన వేళలు తాము కూడా చెప్పలేమని, రైతులే ఏ వేళల్లో విద్యుత్ సరఫరా చేయాలో వీడియోల రూపంలో తమకు తెలిపితే ఆ వీడియోలను ఉన్నతాధికారులకు పంపిస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. దీంతో రైతులు ధర్నా విరమించారు.

రాస్తారోకో.. పోలీసులతో వాగ్వాదం

గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న శాంతినగర్ సీఐ శివశంకర్‌గౌడ్, పోలీసులు రాస్తారోకో విరమించాలని రైతులను కోరారు. విద్యుత్‌శాఖ అధికారులు హామీ ఇచ్చేవరకు రాస్తారోకో విరమించేదిలేదని రైతులు భీష్మించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని రైతులను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించేందుకు ప్రయత్నించగా.. పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. యాసంగిలో 10 గంటలే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని ముందుగా చెప్పిఉంటేటే అందుకు తగ్గట్టుగా పంటలు సాగుచేసేవారమని, 24 గంటలు ఉచితంగా రైతులకు ఇస్తామని చెబుతూ 10 గంటలు కూడా నాణ్యమైన విద్యుత్‌సరఫరా చేయడం లేదని, దీంతో పంటలు ఎండుతున్నాయని, కోట్లలో రైతులు పంటలు నష్టపోవాల్సి వస్తుందని సీఐకి రైతులు వివరించారు. ఇదిలా ఉండగా, అనుమతి లేకుండా రాస్తారోకో ఎలా చేస్తారంటూ పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో రైతులందరు మేమే వస్తామని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని సీఐ, ఏఈ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.


శాంతినగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

2 పూటలు.. 6 గంటలు



24 గంటల కరెంట్ అంటూ వాళ్లిష్టం వచ్చినట్లు సరఫరా ఇస్తున్నారు. ముందు ఉదయం 6 గంటల నుంచి కరెంట్ వచ్చేది. ఇప్పుడు మధ్యాహ్నం 3 గంటలకు ఇస్తుండ్రు. సాయంత్రం 6 గంటలకు తీసేసి రాత్రి 11దాటాక మళ్లీ 3 గంటలు ఇస్తున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు ఇవ్వడం వల్ల మేం మోటార్లు ఆన్ చేసుకోలేకపోతున్నాం. మూడురోజులుగా పూర్తిగా కరెంట్ రావడం లేదు.

– రమేష్, రైతు, గంగాపురం, జడ్చర్ల మండలం

పట్టించుకోవటం లేదు..



కరెంట్ సమస్య గురించి ఎన్నిమార్లు అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవటం లేదు. మూడురోజులుగా కరెంట్ రావడం లేదు. సరఫరాను ఇష్టం వచ్చినట్లు ఇస్తున్నారు. పంటలకు నీళ్ల అందక ఎండిపోతున్నాయి. మా గోస ఎవరికి చెప్పుకోవాలో తెలియక రోడ్డెక్కాం.

– హరీశ్, రైతు, గంగాపురం, జడ్చర్ల మండలం

రెండురోజుల్లో పరిష్కారం..

మాకు రావాల్సిన ఇన్‌పుట్ లోడ్ తక్కువగా రావడం వల్ల నిన్నటి నుంచి ఇబ్బంది కలిగింది. గురువారం ఉదయం సరఫరా ఇవ్వలేకపోయాం. ఉన్నతాధికారులతో మాట్లాడి సరఫరా పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఒకట్రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది. గంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా వేళల మార్పు గురించి తెలుసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– కృష్ణమూర్తి, డీఈ, జడ్చర్ల

నిశ్చితార్థం తెల్లారే అనంత లోకాలకు..

- పొలం దగ్గరికి వెళ్లిన ఇద్దరు యువకులను కబళించిన లారీ
- నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం తిమ్మాయిపల్లిలో ఘటన


రాజు(ఫైల్)


అల్లాజీ(ఫైల్)

సాక్షి, నాగర్‌కర్నూల్/వెల్దండ: బుధవారం నిశ్చితార్థం చేసుకున్న యువకుడు, అతని సోదరినితో కలసి ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పొలానికి వెళ్తున్న సమయంలో లారీ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం తిమ్మాయిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కల్యాణ్‌రావు, సమీప బంధువుల కథనం ప్రకారం.. చారకొండ మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన ఎదిరే రాజు(27), ఎదిరే అల్లాజీ(31) వరుసకు అన్నదమ్ములు. వీరిద్దరు గురువారం ఉదయం 8 గంటల సమయంలో ఇంటి నుంచి గ్రామ శివారులోని వ్యవసాయ పొలానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపైకి చేరుకోగానే కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న లారీ వెనక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. యువకుల మీదుగా లారీ వెళ్లడంతో వారి మృతదేహాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ కల్యాణ్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజు క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, అల్లాజీ భవన నిర్మాణ కార్మికుడిగా ఉపాధి పొందుతున్నాడు. బుధవారమే రాజుకు జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువతితో నిశ్చితార్థం అయింది. ఈనెల 12న పెళ్లి పత్రిక పెట్టుకుని త్వరలోనే పెళ్లి చేయాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. శుభకార్యానికి వచ్చిన బంధువులు ఇంట్లోనే ఉండగా మరుసటి రోజు ఉదయం ఈ దారుణం చోటుచేసుకోవడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మరో యువకుడు అల్లాజీకి భార్య రవణమ్మ దివ్యాంగురాలు, ఆమెతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కల్యాణ్‌రావు పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజు, అల్లాజీల కుటుంబాలను ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, సింగల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు పరామర్శించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం


వెంకటప్ప (ఫైల్)

దామరగిద్ద: ఉమ్మడి జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు పయనమైన ఓ వ్యక్తిని బొలెరో వాహనం మృత్యువు రూపంలో కబళించింది. ఎస్‌ఐ శ్రీనివాసరావు కథనం మేరకు.. మండలంలోని మద్దెల్‌బీడ్‌కు చెందిన దాసరి వెంకటప్ప (40) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లేందుకు భార్య గోవిందమ్మతో కలిసి గురువారం ఉదయం బస్టాప్‌కు చేరుకున్నారు. అదే సమయంలో దామరగద్ద నుంచి నారాయణపేట వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా వచ్చి బస్టాప్ దగ్గరున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది విరిగి వెంకటప్పపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యారు. భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కంచుపాడు శివారులో..

ఉండవెల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని కంచుపాడు శివారు స్నేహ పౌల్ట్రీ గోదాం ఎదుట జాతీయ రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తున్న 50 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన బ్లూకోల్ట్స్ పోలీసులు గుర్తించి నేషనల్ హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. బ్లూకోల్ట్స్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

పేకాట స్థావరంపై దాడి

పాన్‌గల్: పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని బుసిరెడ్డిపల్లి శివారులో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని అయిదు సెల్‌ఫోన్లు, రూ.5,760 నగదు స్వాధీనం చేసుకున్నామని.. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. పేకాట నేరమని.. పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెంకటాపురంలో అయిదుగురు..

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం శివారులో పేకాట స్థావరంపై గురువారం తెల్లవారుజామున దాడిచేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. అందులో ఇద్దరు కొండాపురం, ముగ్గురు పాగుంటకు చెందిన వారిగా గుర్తించామన్నారు. వారి నుంచి రూ.1,780 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నలుగురికి గాయాలు

మక్తల్: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్‌కు చెందిన మంగమ్మ, చెన్నమ్మ, నాగరాజు, డ్రైవర్ కృష్ణయ్య, యశ్వంత్ పట్టణంలో శుభకార్యానికి కారులో వస్తున్నారు. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న దావణగేరికి చెందిన రహెమతుల్లా కారులో అతివేగంగా వచ్చి గొల్లపల్లి స్టేజీ వద్ద రెండు కార్లు ఢీకొన్నాయి. మహబూబ్‌నగర్ చెందిన కారులో ఉన్న వారు నలుగురికి గాయాలయ్యాయి. మంగమ్మకు తలకు బలమైన గాయాలు కాగా, చెన్నమ్మకు నడుముకు తీవ్రంగా గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

మైక్రోస్ప్రింక్లర్లతో ఉల్లిసాగు లాభదాయకం


మైక్రో స్ప్రింక్లర్లతో సాగు చేసిన పంట

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: మైక్రో స్ప్రింక్లర్లతో ఉల్లి సాగు చేయడంతో మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. మైక్రో స్ప్రింక్లర్లతో ఉల్లి పంట సాగు చేసుకుంటే నీటి ఆదా అవుతుందని ఏడీఏ సూచిస్తున్నారు. ఎరువులు సరైన మోతాదులో వాడితే పంట నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు.

మైక్రో స్ప్రింక్లర్ల వాడకం..

ఒక ఎకరానికి 1.4లక్షల మొక్కల సాంద్రత ఉండేటట్లుగా నాటుకోవాలి. వరుసకు వరస 10 సె.మీ. ఉండే విధంగా చూసుకోవాలి. నారు నాటే సమయంలో వాటిని కార్బండిజమ్ ఒక గ్రామును లీటర్ నీటికి, మోనోక్రోటోపాస్ 2 మి.లీ. నీటితో కలిపిన ద్రావణంలో వేర్లను ముంచి నాటాలి.

అమర్చే విధానం..

16 మీ.మీ. లేటరల్స్‌ను ప్రధాన పీవీసీ పైపునకు ప్రతి నాలుగు మీటర్ల దూరంలో అమార్చలి. ప్రతి లేటరల్ పైపుపై 4 మీటర్ల దూరంలో 8 మి.లీ. మీటర్ల ప్లాస్టిక్ పైప్ ద్వారా ఒక మైక్రో స్ప్రింక్లర్లను అమర్చాలి. దీన్ని 3అడుగుల ఎత్తులో అమర్చుకోవాలి. ప్రతి మైక్రో స్ప్రింక్లర్లు గంటకు 148 లీటర్ల నీటిని విడదల చేస్తుంది.

ఇవీ లాభాలు..

నేలలో ఎల్లప్పుడూ తగినంత తేమ ఉండటం వల్ల ఉల్లిగడ్డలు సమానంగా పెద్దగా పెరుగుతాయి. పంటకాలం 15 నుంచి 17 రోజులు తగ్గుతుంది. నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. నీటి తుంపర్ల వలన శిలింధ్రపు తెగుళ్లు ఆశించవు. రసం పీల్చే పురుగులు తుంపర్లకు కొట్టుకొనిపోతాయి. మొక్కల సంఖ్య పెరగడం వల్ల 30నుంచి 40శాతం అధిక దిగుబడి వస్తుంది.

కలుపు నివారణ..

2నుంచి 3 సార్లు కలుపు తీయాల్సి ఉంటుంది. నారు నాటిన మూడు రోజుల తర్వాత పెండిమిథాలిన్ అనే మందును 1 లీటర్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. 40 నుంచి 45 రోజులకు ఒక సారి కలుపుతీయాలి.

నీటి యాజమాన్యం..

పొలంలో నీటి నిల్వ ఉంచరాదు. నీరు నిల్వ ఉంటే గడ్డ నాణ్యత తగ్గిపోతుంది. ఉల్లి వేరు 10–15 సెం.మీ వరకే ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నంత వరకే నీటిని పెట్టాలి.

సస్యరక్షణ..

తామర పురుగుల నివారణకు పిప్రోనిల్ 2 మి.లీ లేదా మిథైల్ డెమటాన్ 2మి.లీలు ఒక లీటర్ నీటిలో కలుపుకోని పిచికారీ చేసుకోవాలి. ఆకుమాడు తెగుళు నివారణకు సాఫ్ ఒక గ్రాము ఒక లీటర్ నీటికి లేదా కిటాజెన్ ఒక మి.లీ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఎరువులు..

ఉల్లి నాటిన 30రోజులకు, 60రోజులకు యూరియా లేదా సి.ఎ.ఎన్ వేసుకోవాలి. ఎకరానికి 10–15 కిలోల సల్ఫర్ వాడాలి. దీని వల్ల నాణ్యమైన గడ్డలు వస్తాయి. 50 కిలోల భాస్వరం 60 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు నాటే ముందు వేసుకోవాలి.

దేవరకద్ర- కృష్ణా రైల్వేలైన్ పూర్తి



మాగనూర్ రైల్వే స్టేషన్

- కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మధ్య మెరుగైన రవాణా
- 66 కిలోమీటర్ల రైల్వే లైన్ పూర్తి
- రూ.3,543 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం

కృష్ణా: మునీరా బాద్ మహబూబ్‌నగర్ రైల్వేలో భాగంగా దేవరకద్ర నుంచి కృష్ణా వరకు ఉన్న 66 కిలోమీటర్ల దక్షిణ మధ్య రైల్వేలైన్ పనులు పూర్తి కావడంతో ఇటు తెలంగాణ ప్రజలతో పాటు కర్నాటక, గోవా రాష్ట్రాల మధ్య రాకపోకలకు, వర్తక, వాణిజ్యపరంగా ఎంతో ఉపయోగకరంగా మారనుంది. మొట్టమొదట 2017లో దేవరకద్ర నుంచి జక్లేర్ గ్రామం వరకు 28.3 కిలోమీటర్లు రూ.943 కోట్ల అంచనా వ్యయంతో పూర్తి చేశారు. తర్వాత జక్లేర్ నుంచి మక్తల్ వరకు 11.5 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులను 2020లో, ఆ తర్వాత మక్తల్ నుంచి మాగనూర్ వరకు ఉన్న 13.3 కిలోమీటర్లను 2022 మార్చిలో, మాగనూర్ నుంచి కృష్ణా వరకు ఉన్న 12.7 కిలోమీటర్లను 2023లో పూర్తి చేశారు. ఈనెల 6న సికింద్రాబాద్, గుంతకల్ డీఆర్‌ఎంలతో పాటు కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ అధికారి ప్రణవ్ సక్సేనా ఆధ్వర్యంలో ట్రయల్‌రన్ నిర్వహించారు. దేవరకద్ర నుంచి కృష్ణా వరకు ఉన్న 66 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ పూర్తి కావడంతో ఇక మీదట అన్నిరకాల రైళ్ల నడిపించేందుకు అవకాశం ఉంటుందని నిర్ధారించారు. గతంలో 6గంటలపాటు ప్రయాణించి హైదరాబాద్ చేరేవారు, ప్రస్తుతం 3గంటల్లోనే చేరుకునే అవకాశం ఏర్పడనుంది.


రైల్వే లైన్‌ను పరిశీలిస్తున్న సికింద్రాబాద్ రైల్వే డీఆర్‌ఎం, గుంతకల్ డీఆర్‌ఎంలు

త్వరలోనే కాచిగూడ– కృష్ణా రైలు..

కాచిగూడ నుంచి కృష్ణా వరకు రైలును త్వరలోనే ప్రారంభిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి కర్నాటకలోని రాయచూర్, బళ్లారి, గుంతకల్, హుబ్లీ, గోవాకు త్వరగా చేరుకునే అవకాశం ఉంటుంది. వర్తక, వాణిజ్యపరంగా, ప్రజా రవాణాలకు ఈ దారి ఎంతో ఉపయోగంగా మారనుంది. నిత్యం వందల సంఖ్యలో రాయచూర్ నుంచి హైదరాబాద్ వరకు వాణిజ్య వాహనాలు, ప్రజా రవాణా వాహనాలు రోడ్డు ద్వారా రాకపోకలు సాగిస్తున్నాయి. మక్తల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేందుకు రైల్వేలైన్ అందుబాటులోకి రావడం ఎంతో తోడ్పడనుంది. ఇక్కడి రైతులు పండించే ధాన్యం, కూరగాయలు, పండ్లు అటు హైదరాబాద్, ఇటు కర్నాటకలోని రాయచూర్‌కు తరలించేందుకు వీలు కలుగనుంది.

అభివృద్ధికి తోడ్పాడు..



మునీరాబాద్ రైల్వే లైన్ పూర్తి కావడంతో మక్తల్ నియోజకవర్గం అన్ని రకాలుగా వేగంగా అభివృద్ధి చెందనుంది. ఈ ప్రాంతం నుంచి ఎటు వెళ్లాలన్నా తక్కువ సమయంలో గమ్యం చేరుకునేందుకు వీలు కలుగుతోంది. మా తండ్రి చిట్టెం నర్సిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రభుత్వానికి ప్రతిపాదించారు. నా హయాంలో పూర్తికావడం ఆనందంగా ఉంది.

– చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో బైకు యాత్ర చేస్తా

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ/ఇబ్రహీం పట్నం: దక్షిణ తెలంగాణలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో తాను బైకు యాత్ర నిర్వహిస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 13న పార్లమెంట్ సమావేశాలు ముగుస్తాయని, ఆ తరువాత యాత్ర ప్రారంభిస్తానని వెల్లడించారు. బైకు యాత్ర అయితే ఎక్కువ గ్రామాలు తిరిగేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గురువారం ఆయన నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌గర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలో యాత్ర ఉంటుందని, ఈ విషయం అధిష్టానానికి కూడా చెప్పానని వివరించారు. ధరణి పోర్టల్‌తో ఎంతో మంది ఇబ్బందులు పడతున్నారని, రోజూ తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. ప్రగతి భవన్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి స్పందిస్తూ.. ప్రగతి భవన్ ప్రజల సొత్తని, అది కేసీఆర్‌ది కాదని అన్నారు. గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజా దర్బారు పెట్టి రోజూ సామాన్య ప్రజలను కలసి వారి సమస్యలను పరిష్కరించారని చెప్పారు. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఆరోగ్య శ్రీ, 104, 108 వంటి పథకాలను పెడితే తెలంగాణ ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. 108, 104లో పనిచేసే ఉద్యోగులకు కూడా నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కాగా, హైదరాబాద్- విజయవాడ హైవే విస్తరణకు ప్రధాన మంత్రిని కలసి ఓకే చేయించానని వెంకట్‌రెడ్డి చెప్పారు. దీని కోసం రూ.1,600 కోట్లు మంజూరు చేయడానికి ఆయన అంగీకరించారని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు.

ఓబీసీల్లో వీరశైవ లింగాయత్ సహా 24 ఉప కులాలు

చేర్చాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లోని వీరశైవ లింగాయత్ కులంతో పాటు 24 ఉపకులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ కోరారు. వీరశైవ లింగాయత్, 24 ఉపకులాల ప్రతినిధులతో కలిసి గురువారం జాతీయ బీసీ కమిషన్ (ఎన్సీబీసీ) చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్‌ను ఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వీర శైవ లింగాయత్ కులం, సంచారజాతులైన బుక్క అయ్యవారాస్, గోత్రాల, బొద్దిలి, ఆరె మరాఠి మరాఠ సహా మొత్తం 24 ఉప కులాలను ఓబీసీల్లోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు మేలు చేసేందుకే ధరణి

- శాసనసభలో మంత్రి వేముల
- 13 లక్షల ఫిర్యాదులొస్తే 12 లక్షలు పరిష్కారం
- రెండేళ్లలో 24 లక్షల లావాదేవీలు



సాక్షి, హైదరాబాద్: వివాదాల్లేకుండా, భూ రికార్డులను భద్రపర్చి రైతులకు మేలు చేసేందుకే ధరణి పోర్టల్ తీసుకొచ్చామని శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ధరణిలో భూమి నమోదు కాలేదని ఇప్పటివరకూ 13 లక్షల ఫిర్యాదులొస్తే 12 లక్షలు పరిష్కరించినట్టు చెప్పారు. రైతుకు తన భూమిపై పూర్తి హక్కు కల్పించే ధరణిని విపక్షాలు అడ్డుకోవడం విడ్డూరమన్నారు. గురువారం శాసనసభలో పలు పద్దులపై చర్చకు మంత్రి సమాధానమిచ్చారు.

పైరవీకారుల రాజ్యాన్ని తెచ్చేందుకే..

రైతులను పీడించే పైరవీకారుల రాజ్యాన్ని మళ్లీ తెచ్చేందుకే కాంగ్రెస్ పార్టీ ధరణిని వ్యతిరేకిస్తోందని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. సాదా బైనామా ద్వారా భూమి రికార్డుల్లోకి ఎక్కించేందుకు 2016లోనే కాకుండా 2020లోనూ అవకాశం కల్పించామని, ఈ దశలోనే కోర్టు కేసు వల్ల ఇది ఆగిపోయిందన్నారు. ఈ రెండేళ్లలో ధరణి ద్వారా 24 లక్షల లావాదేవీలు జరిగాయని, కేవలం 15 నిమిషాల్లోనే లావాదేవీ పూర్తవుతోందని తెలిపారు. ధరణిలో 33 మాడ్యూల్స్ ఇవ్వడం వల్ల, ప్రతి గ్రామంలోనూ సమస్య పరిష్కారం దిశగా కృషి చేయడం వల్ల సమస్యలు తగ్గుతున్నాయని చెప్పారు.

58, 92 జీవోల ద్వారా క్రమబద్ధీకరణ

125 గజాలున్న 1.25 లక్షల మంది పేదలకు 58 జీవో ద్వారా ఇళ్ళ జాగాలను క్రమబద్ధీకరించామని, ఇళ్ళు కట్టుకున్న 36 వేల మంది పేదలకు 59 జీవో ద్వారా క్రమబద్ధీకరణ చేశామని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో భవంతులు ఉన్న 44 కాలనీల్లో రెగ్యులైజేషన్ చేపట్టి, యజమానుల్లో ఆందోళన తగ్గించామని చెప్పారు. 2.92 లక్షల మందికి డబుల్ బెడ్రూ ఇళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో 1.38 లక్షలు పూర్తి చేశామని, మరో 45 వేలు 90 శాతం పూర్తయ్యాయని, 35 వేలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ పథకానికి రూ. 11,639 కోట్లు ఖర్చవుతుంటే కేంద్రం ఇచ్చింది కేవలం రూ.1,311 కోట్లు మాత్రమేనన్నారు.

వక్ఫ్ భూములు పరిరక్షిస్తాం

ఆదాయంలో రిజిస్ట్రేషన్ల శాఖ 3వ స్థానంలో ఉందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు సంబంధించిన న్యాయపరమైన చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ రోడ్ల మరమ్మతు పనులు చేస్తున్నామని, గ్రామం నుంచి మండలానికి బీటీ రోడ్డు, మండలం నుంచి జిల్లాకు డబుల్ రోడ్డు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు.

‘మండలి’ డిప్యూటీ చైర్మన్‌గా బండా ప్రకాశ్!

- ఏడాదిన్నర తర్వాత శాసన మండలికి డిప్యూటీ చైర్మన్
- నేడు నోటిఫికేషన్, 11న నామినేషన్, 12న ఎన్నిక
- అదే రోజు కొత్త డిప్యూటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ
- త్వరలో మండలి చీఫ్ విప్, విప్‌ల నియామకం?



సాక్షి, హైదరాబాద్: సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ ఎన్నికకు సంబంధించి శుక్రవారం నోటిఫికేషన్ వెలువడనుండగా, 11వ తేదీన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన తదితరాలు పూర్తి చేస్తారు. 12న ఉదయం 10 గంటలకు శాసన మండలి ప్రారంభమైన అనంతరం డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసి బాధ్యతలు అప్పగిస్తారు. కాగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ముదిరాజ్ ఎన్నిక దాదాపు ఖాయమైంది. ఆయన పేరును బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. దీంతో ఈ నెల 11న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు సంబంధించి నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు బండా ప్రకాశ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరించిన నేతి విద్యాసాగర్ 2021 జూన్ 3న ఎమ్మెల్సీగా తన పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. అప్పటి నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నిక జరగకపోవడంతో సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. ఇదిలా ఉంటే 2018 మార్చిలో బీఆర్‌ఎస్ తరపున రాజ్యసభకు ఎన్నికైన బండా ప్రకాశ్ ఎంపీగా ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేయకుండానే 2021 నవంబర్‌లో ఎమ్మెల్యే కోటాలో శాసన మండలికి ఎన్నికయ్యారు. అనంతరం 2021 డిసెంబర్ మొదటి వారంలో బండా ప్రకాశ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం శాసన మండలిలో డిప్యూటీ చైర్మన్‌తో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్, మరో రెండు విప్ పదవులు కూడా ఖాళీగా ఉన్నాయి. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ ఒక్కరే ప్రస్తుతం మండలిలో ప్రభుత్వ విప్‌గా వ్యవహరిస్తున్నారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ముగిశాక మండలి చీఫ్ విప్, విప్ పదవుల భర్తీ జరుగుతుందని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

50 సీట్లలో పోటీపై సరైన సమయంలో నిర్ణయం

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ
- అసెంబ్లీలో కేటీఆర్‌తో భేటీ
- తాజ్‌మహల్ కంటే అందంగా తెలంగాణ సెక్రటేరియట్ ఉందంటూ ప్రశంస



సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో 50 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అంశంపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని ఏఐఎంఐఎం అధినేత, లోక్‌సభ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ వెల్లడించారు. ఎన్నికలకు చాలా సమ యం ఉందని అంటూనే అక్టోబర్ నాటికి నిర్ణయం తీసుకుంటామనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ గురువారం రాత్రి అసెంబ్లీకి వచ్చారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో భేటీ అనంతరం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రావడం మంచి పరిణామమని పేర్కొంటూ, తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలన బాగుందని కితాబునిచ్చారు. బీఆర్‌ఎస్ దేశవ్యాప్తంగా విస్తరించి జాతీయ రాజకీయాల్లోకి రావడం మంచిదేనని అసదుద్దీన్ అన్నారు. ఎంఐఎం పార్టీ బీజేపీకి బీ టీమ్ అంటూ కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని, తాము ఎవరికీ బీ టీమ్ కాదన్నారు. బీజేపీని ఓడించాల్సిన అవసరముందన్నారు. అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలనే డిమాండ్‌కు ప్రధాని మోదీ ఒప్పుకోవడం లేదని చెప్పారు. తాజ్‌మహల్ కంటే అందంగా తెలంగాణ కొత్త సచివాలయాన్ని కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిందని ప్రశంసించారు. ఈ నెల 17న జరిగే సచివాలయం ప్రారంభోత్సవం అధికారిక కార్యక్రమం అయినందున తాము కూడా వెళ్తామన్నారు. అయితే సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభతో తమ పార్టీకి సంబంధం లేదన్నారు. పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు ఇతర పార్టీలను ఆహ్వానించడం బీఆర్‌ఎస్‌కు సంబంధించిన విషయమని ఎంపీ అసదుద్దీన్ వ్యాఖ్యానించారు. మండలి స్థానిక సంస్థల కోటా ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థికి బీఆర్‌ఎస్ మద్దతు కోరేందుకు సమయముందని, కేటీఆర్‌తో భేటీలో ఈ అంశం ప్రస్తావనకు రాలేదని చెప్పారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ షెడ్యూల్‌పై చర్చ

మండలి స్థానిక సంస్థల కోటాలో హైదరాబాద్ నుంచి ఎన్నికైన ఎంఐఎం ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ పదవీకాలం మేలో ముగియనుంది. ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానం ఎన్నికకు షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో మంత్రి కేటీఆర్‌తో అసద్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మండలిలో ఎంఐఎంకు ఇద్దరు సభ్యులుండగా, రెండు స్థానాలూ గతంలో బీఆర్‌ఎస్ మద్దతుతోనే సాధించింది. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో బీఆర్‌ఎస్ సంఖ్యాపరంగా అతిపెద్ద పార్టీ కావడంతో మళ్లీ ఈ స్థానాన్ని తమకు కేటాయించాలని కోరేందుకు ఆయన అసెంబ్లీకి వచ్చినట్లు సమాచారం. కాగా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానంలో ఎంఐఎంకు మద్దతుకు సంబంధించి బీఆర్‌ఎస్ ఒకట్రెండు రోజుల్లో వైఖరి వెల్లడించే అవకాశమున్నట్లు తెలిసింది.

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు 2023-24

‘రైతులు క్వింటాలుకు 8 కిలోలు నష్టపోతున్నారు’



సాక్షి, హైదరాబాద్: కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయిస్తున్నప్పటికీ, మిల్లర్ల పెత్తనంతో క్వింటాలుకు 7–8 కిలోల ధాన్యాన్ని నష్టపోతున్నారని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతు ధాన్యం విక్రయించగానే వాహనాలకు ట్రిప్ షీట్ ఇవ్వకపోవడంతో మిల్లర్లు రైతులను పిలిపించి సాకులు చూపుతూ క్వింటాలుపై 8 కిలోల వరకు ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో గురువారం పద్దులపై చర్చ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ నుంచి తీసుకునే బియ్యానికి డబ్బులు చెల్లించకపోవడంతో రూ. 20వేల కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని, వాటిని వెంటనే చెల్లించాలన్నారు. రేషన్ కార్డుల జారీని ఎన్నికలకే పరిమితం చేయకుండా అర్హులకు కుటుంబాలకు అందజేయాలని కోరారు. ఎక్సైజ్ ఆదాయం కోసం బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్‌భూములు ఎవరి జాగీర్లు కావు

- భూ చట్టాల పేరిట ముస్లింలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి
- బీసీలకు కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయడంలో అన్యాయం
- ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వక్ఫ్ భూములు ఎవరివో తెలియని పరిస్థితి నెలకొందని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి భూ చట్టాల పేరిట ముస్లింలు భూములు కోల్పోయారని, ఇనాం భూములు, జాగీర్ భూములు పోయి పేదలుగా మారారని, వారికి జరిగిన అన్యాయాన్ని సవరించాలని కోరారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ భూములెవరి జాగీర్లు కావని, దేవుడి ఆస్తి అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని వక్ఫ్‌భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం వక్ఫ్‌భూముల్లో రూ.100, రూ 200తో అద్దెలకు ఉంటున్న వారు ఆ అద్దెలను కూడా చెల్లించడం లేదని, సంవత్సరాలుగా తిష్టవేశారన్నారు. వక్ఫ్, దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న కొన్ని భూముల పత్రాలు పర్షియన్ భాషలోఉన్నాయని, వాటిని ట్రాన్స్‌లేట్ చేయించాలని కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఉన్నత విద్యా కమిటీలలో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలని అక్బరుద్దీన్ కోరారు. బీసీల సంక్షేమం విషయంలో ప్రభుత్వం పట్ల అసంతృప్తి నెలకొందని, గత ఏడాది బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయిస్తే కేవలం రూ.417 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. 2014 నుంచి 2023 వరకు బీసీల సంక్షేమానికి అయిన ఖర్చు అసంతృప్తిని మిగిల్చిందని, ఈసారి బీసీలకు బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా నిధులు విడుదల చేయాలని కోరారు. దళితబంధు తరహాలో బీసీబంధు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు భేష్

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేసిన కేటాయింపుల పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిన అక్బరుద్దీన్ ఒవైసీ... రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పథకాలను కొనియాడారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉర్దూను రెండో అధికారిక భాషగా ప్రకటించిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ముస్లింలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నప్పటికీ తాను హిందూ, క్రిస్టియన్, సిక్కులు తదితర అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నట్లు అక్బరుద్దీన్ చెప్పారు.

పకడ్బందీగా టీసీసీ పరీక్షలు



కందనూలు: ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో డ్రాయింగ్, టైలరింగ్, టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ గోవిందరాజులు సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం డీఈఓ కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణకు జిల్లా కేంద్రంలో 4 కేంద్రాలు ఏర్పాటుచేయగా, డ్రాయింగ్ లోయర్‌లో 371, డ్రాయింగ్ హైయర్ లో 241, టైలరింగ్ హైయర్ మరియు లోయర్‌లో 160 మంది అభ్యర్థులు టెక్నికల్ కోర్స్ పరీక్షలకు హాజరుకానున్నారని డీఈఓ తెలిపారు. ముఖ్యంగా టైలరింగ్ పరీక్షలకు హాజరయ్యే, అభ్యర్థులు తమ వెంట తప్పనిసరిగా కుట్టు మిషన్లను తీసుకురావాలన్నారు. కోర్సుల ఆధారంగా పరీక్ష సమయం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. టెక్నికల్ కోర్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ అప్లికేషన్ నెంబర్, పుట్టిన తేదీని ఎంట్రీ చేసి www.brc.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, ప్రధానోపాధ్యాయురాలు లత, స్టాంగ్ టీచర్ వెంకటేశ్వర శెట్టి, సెక్షన్ క్లర్క్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తాగి నడిపితే జైలుకే..

- కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- 2022లో 6,851 డ్రంకన్‌డ్రైవ్ కేసులు

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. రహదారి ప్రమాదాల సంఖ్యను తగ్గించడంలో భాగంగా డ్రంకన్ డ్రైవ్ పరీక్షలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఓ వైపు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తూనే, మరో వైపు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలను నిర్వహిస్తు పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

17 మందికి జైలు శిక్ష

గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 6,851 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, రూ.60,07,919 జరిమానా విధించారు. జిల్లా మొబైల్ కోర్టు 6,834మందికి పలు రకాల జరిమానాలు విధించగా, మరో 17మంది వాహనదారులకు జైలు శిక్ష విధించారు. ఇందులో 1,245 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నెలలో 724 డ్రంకన్‌డ్రైవ్ కేసులు నమోదు చేయగా 359మంది వాహనదారులు కోర్టులో హాజరై జరిమానాలు చెల్లించారు. 365మంది కోర్టులో హాజరుకావాల్సి ఉంది. గతేడాదిలో అత్యధికంగా మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు 1,722 కేసులు నమోదు చేయగా అత్యల్పంగా సీసీకుంట పోలీసులు 161 నమోదు చేశారు. మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీసులు 587 కేసులు, అడ్డాకుల 470, జడ్చర్ల 450, మహబూబ్‌నగర్ వన్‌టౌన్ 419, భూత్పూర్ 407, మహబూబ్‌నగర్ రూరల్ 382, బాలానగర్ 371 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.



డ్రంకన్‌డ్రైవ్ తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎంవీఐ యాక్ట్ కేసులు

ఏడాది	కేసులు	జరిమానా
2022	1,91,238	రూ.7,88,48,319

పెరిగిన కేసులు

2021లో కంటే 2022లో నమోదైన కేసుల సంఖ్య రెట్టింపు ఉంది. వాహనాల ఆకస్మిక తనిఖీలు మరింతగా పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. ఇప్పటికే పలు పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులతో సహా ప్రధాన కూడళ్లలో ఉండే వాహనదారులకు ప్రత్యేకంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాల కట్టడి కోసం



జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి డ్రంకన్‌డ్రైవ్ కేసులు పెంచాం. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల ప్రమాద తీవ్రతతో పాటు ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు అవుతున్నాయి. దీంతో ప్రాణనష్టంతో పాటు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. దీనిని చాలా వరకు కట్టడి చేయడానికి తనిఖీ విస్తృతం చేశాం. – నర్సింహ, ఎస్పీ, మహబూబ్‌నగర్

ఆన్‌లైన్ ద్వారానే కేసు

వాహనాల తనిఖీ సమయంలో బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రంకన్ డ్రైవ్ పరీక్షలను నిర్వహిస్తారు. పట్టుబడిన వారు గతంలో డిపార్ట్‌మెంట్‌లో తెలిసిన వారితో లేదా పలుకుబడి ఉన్న వారితో ఫోన్ చేయించి వదిలించుకునే ప్రయత్నం చేసేవారు. ప్రస్తుతం వాహనదారులకు అలాంటి అవకాశం ఇవ్వకుండా పరీక్షల్లో పట్టుబడిన వెంటనే వాహనం రిజిస్ట్రేషన్ నంబర్లు బ్రీత్ అనలైజర్‌లో చూపించిన ఆల్కహాల్ శాతం, వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చి కేసు నమోదు చేస్తున్నారు. బీఏసీ(బ్లడ్ ఆల్కహాల్ కన్సంట్రేషన్) ప్రమాణాల మేరకు ప్రతి వంద మిల్లీలీటర్ల రక్తంలో 30మిల్లీ గ్రాములకు మించి మద్యం మోతాదు మించకూడదు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో 30 ఎంజీ దాటిన వారిపై కేసు నమోదు చేస్తారు. పరీక్షల్లో పట్టుబడిన వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి, మద్యం సేవించి ఉన్న వాహనదారులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తారు. చార్జిషీట్ నమోదు చేసి కేసును న్యాయస్థానానికి పంపిస్తారు. కేసు తీవ్రతను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.4వేల పైవరకు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగు

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి

వనపర్తి క్రైం: ప్రధాని నరేంద్రమోదీ పాలనతోనే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి అన్నారు. 2023–24 కేంద్ర బడ్జెట్‌పై గురువారం జిల్లాకేంద్రంలోని శ్రీలక్ష్మి కృష్ణ గార్డెన్‌లో మేధావుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల వారికి ప్రయోజనం చేకూరేవిధంగా ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థలో వెనకబడిపోయిందని, ప్రధాని మోదీ పాలనలో ప్రస్తుతం ప్రపంచంలోని ఐదు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశాల్లో మనదేశం ఉండడం గర్వకారణమన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం మోదీ పనిచేస్తున్నారని, అది జీర్ణించుకోలేని ప్రతిపక్షాల లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని, సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చమరగీతం పాడాల్సిన రోజులు దగ్గరపడ్డాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరవేసేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ బోసుపల్లి ప్రతాప్, అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ, సబ్బిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు నారాయణ, రామన్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బచ్చురాం, రాంమ్మోహన్, శ్రీశైలం, పెద్దిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి


జోగుళాంబ హుండీ ఆదాయం రూ.68,23,663



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ ఈఓ, ఏసీ, అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన హుండీ లెక్కింపు రాత్రి 8.45 గంటలకు ముగిసింది. దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి, అన్నదాన సత్రం హుండీల ద్వారా రూ.68,23,663 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 117 రోజుల హుండీ లెక్కింపు ద్వారా ఈ ఆదాయం వచ్చిందని చెప్పారు. ఇదిలా ఉండగా అమ్మవారి హుండీ ద్వారా రూ.54,59,538 ఆదాయం చేకూరగా.. స్వామివారి ఆలయం ద్వారా రూ.13,15,445, అన్నదాన సత్రం ద్వారా రూ.48,680 ఆదాయం వచ్చింది. అలాగే 4 యూఎస్ డాలర్లు, మలేషియన్ రిజెట్స్ 1, కువైట్ 1/4-1 వచ్చిందన్నారు. మిశ్రమ బంగారం 64 గ్రాములు, మిశ్రమ వెండి 475 గ్రాములు వచ్చింది. మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, ఫస్ట్ గ్రేడ్ ఈఓ మదనేశ్వరరెడ్డి, ఎస్ఐ మహేందర్, ఆలయ ముఖ్య అర్చకుడు ఆనంద్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, బ్రహ్మయ్య ఆచారి, రికార్డు అసిస్టెంట్ ప్రదీప్, శ్రీకాంత్, ఏపీజీవీబీ అధికారులు పాల్గొన్నారు.

పోలేపల్లి ఎల్లమ్మ జాతర ప్రారంభం



జాతర ప్రాంగణంలో వెలిసిన దుకాణాలు

కోస్గి: మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ జాతర గురువారం నుంచి ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దుకాణాలు, రంగుల రాట్నాలు, కళా ప్రదర్శన కేంద్రాలు ఏర్పాటయ్యాయి. మొదటి రోజు గురువారం అమ్మవారి విగ్రహానికి చక్రస్నానం చేయించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 10 గంటలకు వేంచేపు కార్యక్రమంలో భాగంగా అమ్మవారు గ్రామం నుంచి పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి చేరుకోగా శుక్రవారం ప్రధాన షిడే ఘట్టం నిర్వహించనున్నారు.



జాతరకు ఎడ్లబండ్లపై వస్తున్న పల్లె జనం

ఎడ్ల బండ్లపై బయలుదేరిన పల్లెజనం

ఎల్లమ్మ జాతరకు పల్లెజనం ఎడ్లబండ్లపై బయలుదేరారు. బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమైన కోస్గి శివారులో వరుసగా వెళ్తున్న ఎడ్లబండ్లు ఆకట్టుకున్నాయి.

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి కోసం ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. పరీక్ష కోసం 1,812 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఉదయం 11:15గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని తెలిపారు. పరీక్ష కోసం వట్టెం విద్యాలయంతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 6 పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రామన్‌పాడుకు 1,077 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉంది. ఇదే క్రమంలో జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,050 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.